


***రచనాకాలం: 2000 సంవత్సరం***

*(గత సంచిక తరువాయి)*

14

**చాలా చిన్న** ఇంటర్వ్యూ అది. విరించి అప్లికేషన్ ఫారాన్ని రాబర్ట్ పార్కర్ థరోగా చదివి అర్థం చేసుకున్నాడు. విరించిని కొన్ని ప్రశ్నలు వేశాడు.

"నీకు అమెరికాకి వచ్చి పొలిటికల్ అసైలమ్ కోసం అప్లయ్ చేయమని ఎవరు సలహా ఇచ్చారు?"

"ఎవ్వరూ ఇవ్వలేదు. ప్రపంచంలోని అతి పెద్ద డెమాక్రాటిక్ దేశాల్లో ఇదొకటి కాబట్టి ఇక్కడ నాకు న్యాయం జరగవచ్చనిపించింది."

"నీకిక్కడ బంధువులెవరయినా వున్నారా?"

"లేరు."

"మీ ప్రభుత్వం నీకు రక్షణ ఇవ్వలేదని ఎందుకు నిశ్చయించుకున్నావు?"

"మా ప్రభుత్వాన్ని అన్ని విధాల సహాయాన్ని అర్థించాను. పోలీస్‌శాఖ రక్షణ ఇవ్వలేమంది. నన్ను నేను రక్షించుకోడానికి తుపాకి లైసెన్స్ సైతం ఇవ్వను పొమ్మంది, పైగా అప్పటికే నామీద నాలుగైదు హత్యాప్రయత్నాలు జరిగాయని తెలిసికూడా. ఇక ఇండియాలో నా ప్రాణాలకి రక్షణ లేదని గ్రహించాక ముందు పొలిటికల్ అసైలమ్‌కి జర్మనీకి వెళదామనుకున్నాను. కాని నే చదివిన ఓ ఆర్టికల్ ద్వారా ఆ దేశంలో ఏసియన్స్ మీద జర్మన్స్ దాడులు అధికంగా చేస్తున్నారని తెలుసుకున్నాక అమెరికాని ఎన్నుకున్నాను."

"ఏ మేగజైన్‌లో చదివారా ఆర్టికల్?"

"ది వీక్‌లో"

"ఆ ఆర్టికల్ కాపీ మీ దగ్గర వుందా?"

"రెడీగా లేదు. ఈసారి ఇంటర్వ్యూకి వచ్చేప్పుడు తెస్తాను."

ఆ పాయింట్‌ని రాబర్ట్ నోట్ చేసుకున్నాక అడిగాడు.

"అమెరికాకి రాబోయే ముందు మీరు జిరాక్స్ షాప్‌ని నడిపేవారా?"

"అవును."

"మరి హీరాలాల్ కెమికల్స్ కంపెనీలో పనిచేస్తున్నట్లుగా బిజినెస్ వీసా ఎలా తీసుకున్నారు?"

"మేనిఫ్యాక్చరర్ వీసా కోసం ఇండియాలో నా ఏజ్ గ్రూప్ వారికి అమెరికాకి ఓ పట్టాన వీసా దొరకదు కాబట్టి ఇది తప్పలేదు."

"అంతా ఓ పథకం ప్రకారం చేసుకొచ్చారన్నమాట."

"అవును. ఒక్క అప్లికేషన్‌లోని వివరాలు తప్ప. అందులో మేనిప్యులేషన్ ఏం లేదు. లైఫ్ అండ్ డెత్ సమస్య కదా నాకు."

"వి విల్ చెకిట్ అప్. ఎంప్లాయ్‌మెంట్ ఆథరైజేషన్ కావాలని అప్లయ్ చేసావా?"

"అవును సర్"

"ఓ.కె. ఎవ్విరిథింగ్ లుక్స్ ఆల్‌రైట్."

టెంపరరి వర్క్ పర్మిట్‌ని విరించికి ఇవ్వబోయేముందు అతని పది చేతివేళ్ళ ముద్రలని ఓ పెద్దకార్డు మీద ఒకేసారి ఎడం చేతి నాలుగు వేలి ముద్రలని కుడిచేతి నాలుగు వేలి ముద్రలని ఓ చోట, బొటన వేళ్ళని మళ్ళీ వాటి ప్రక్కనే తీసుకున్నాడు.

అతను చెయ్యి కడుక్కున్నాక విరించితో కరచాలనం చేసి చెప్పాడు.

"గుడ్‌లక్ అండ్ బైబై."

"థాంక్స్. బైబై."

విరించి బయటికి వచ్చాక పార్కర్ ఇచ్చిన కవరు తెరచి చూస్తే అందులో ఆరు నెలల వరకు ఇచ్చిన వర్క్ పర్మిట్, ఆరునెలల తర్వాత మళ్ళీ ఇంటర్వ్యూకి రావాల్సిన తేదీ, సమయంగల ఉత్తరం వున్నాయి.

దీర్ఘంగా నిట్టూర్చాడు విరించి. గోపీనాథ్ ప్లేన్ సక్సెస్‌కి గుర్తయిన ఆ వర్క్ పర్మిట్‌ని మృదువుగా ముద్దుపెట్టుకున్నాడు.

ఈ ఆటలో తను అమెరికన్ ఐ.ఎన్.ఎస్ శాఖని ఓడించి సిటిజన్‌షిప్‌ని తేలిగ్గా పొందగలడన్న ధైర్యం విరించిలో చోటుచేసుకుంది. అతనిలో ఇదివరకున్న అనుమానాలన్నీ మాయం అయ్యాయి.

దగ్గరే వున్న మెక్‌డొనాల్డ్ రెస్టారెంట్‌కి వెళ్ళాడు. బిగ్‌మేక్, ఏపిల్ పై, కోక్‌లని లంచ్ ముగించాడు. దివాకర్ చూపించిన దగ్గరే వున్న మాల్‌లోకి వెళ్ళాడు. అందులో నాలుగు సినిమా థియేటర్లున్నాయి. ఒకో దాంట్లో ఒకో సినిమా చూపిస్తున్నారు. ప్రతీది రెండువందల మంది పట్టే చిన్న థియేటరే. అమెరికాలో పెద్ద సినిమా థియేటర్లు మాయం అయి ఇలా పదిమంది వచ్చే అనేక దుకాణాల సముదాయం అయిన మాల్స్‌లో తక్కువ సీటింగ్ కెపాసిటీగల చిన్న థియేటర్లు వచ్చాయని, సినిమా థియేటర్లకి జనం రావడం తగ్గడంతో అమెరికా అంతటా ఇలా జరిగిందని దివాకర్ చెప్పడం గుర్తొచ్చింది.

'ఘోస్ట్' ఆడుతోంది ఒకదాంట్లో. ఇండియాలో దానిగురించి విని వున్నాడు కాని ఆ సినిమా చూడకపోవడంతో ఆ థియేటర్‌కి వెళ్ళాడు. సినిమా ముగిసిన గంటన్నరకి విరించిని ఆ మాల్‌లోని ఓ కాఫీషాప్‌లో ముందు అనుకున్న సమయంలో పికప్ చేసుకున్నాడు దివాకర్.

అతని వర్క్ పర్మిట్‌ని చూపించాడు విరించి దారిలో.

"ఫెంటాస్టిక్ గోపీకి విషయం వెంటనే చెప్పాలి."

తన సెల్‌ఫోన్‌లో అప్పటికప్పుడు ఇండియాకి ఫోన్ చేసి ఆ విషయం గురించి గోపీనాథ్‌కి హిందీలో చెప్పాడు దివాకర్.

"అయితే మావాడికి ఉద్యోగం చూడలి నువ్వు వెంటనే."

అవతలనించి చెప్పాడు గోపీనాథ్ ఆనందంగా.

"ష్యూర్ నీవు చేసిన సెవెన్ ఎలివెన్‌లో ఈజీగా దొరుకుతుంది" చెప్పాడు దివాకర్.

"జాగ్రత్త. విరించి నా తమ్ముడన్న సంగతి రహస్యంగా వుంచాలి" హెచ్చరించాడు గోపీనాథ్.

"నాకు తెలుసది. అది ఐ.ఎన్.ఎస్. నోటీస్‌కి వస్తే ఇంకాస్త జాగ్రత్తగా స్క్రూటిని చేస్తారని నీ భయం కదా! నీ రిఫరెన్స్ ఎక్కడా తీసుకురాను."

ఇంటికి వెళ్ళాక సునీత సంగతి వినగానే సంతోషపడింది.

"అయామ్ గ్లాడ్ మీ అన్నయ్య కూడా ఇంతదాకా సక్సెస్ అయ్యాడు. ఈ తర్వాతి భాగమే సక్సెస్ అవాల్సిన అసలయిన గడ్డుభాగం" చెప్పింది.

సునీత కొడుకు రాఖేష్ రెండుసార్లు పాలు ఇమ్మని అడిగాడు తల్లిని. కానీ వీళ్ళతో మాట్లాడుతూ అతన్ని పట్టించుకోకపోవడంతో అరిచాడు.

"గెట్ ది 'హెల్' అవుటాఫ్ హియర్" కొడుకు ఉపయోగించిన పదానికి స్టన్నయిన దివాకర్ అడిగాడు వెంటనే సునీతని.

"వేర్ ది 'హెల్' డిడ్ హి లెర్న్ టు టాక్ లైక్ దట్?"

"మీ నించే" చెప్పింది సునీత.

ఫక్కున నవ్వాడు విరించి కూడా.

విరించి అమెరికాకి వచ్చి రెండు వారాలు దాటింది. వర్క్ పర్మిట్ వచ్చి నాలుగురోజులైంది. అతనికి వెంటనే ఉద్యోగంలో చేరాలని వుంది కానీ వంటరిగా బయటికి వెళ్ళలేడు. అతన్ని ఆఫీసులో దించి తీసుకురావడానికి దివాకర్, లేదా సునీతలలో ఒకరు కారు డ్రయివ్ చేయడానికి రావాలి. వాళ్ళకి తీరిక వుండదు.

ఓ రోజు చెప్పాడు దివాకర్‌సింగ్.

"మనిషి బ్రతకడానికి ఆక్సిజన్ ఈ ప్రపంచంలో ముఖ్యం. అమెరికాలో దాంతోపాటు కారు డ్రయివింగ్ లైసెన్స్ ముఖ్యం."

ఆ రోజే కారు డ్రయివింగ్ నేర్పే స్కూల్లో చేరాడు. ఇన్‌స్ట్రక్టర్ బ్లేక్ లేడి. ఆమె ఇంగ్లీష్ యాస విరించికి ఓ పట్టాన అర్థం అయ్యేదికాదు. అది గ్రహించిన ఆమె ఒక్కో పదం అర్థమయ్యేలా చెప్పసాగింది.

విరించికి స్కూటర్, కారు డ్రయివింగ్ లైసెన్స్ ఇండియాలో నేరుగా ఇంటికే వచ్చాయి. ఆర్.టి.ఓ ఆఫీస్‌లోని ఓ టాప్ అఫీషియల్, విరించి తండ్రి మంచి మిత్రులు కాబట్టి. ఆ సంగతి చెపితే ఆమె నవ్వి చెప్పింది.

"ఇక్కడ ఏదీ అలా వుచితంగా రాదు. దేన్నయినా కష్టపడి సంపాదించుకోవాలి. నియమాలకి వ్యతిరేకంగా ఏ ప్రభుత్వోద్యోగి అమెరికాలో పనిచేయడు."

ఇండియాలోలా కారు డ్రయివింగ్ చేయడం ఒక్కటే వస్తే సరికాదు. ట్రాఫిక్ నియమాలన్నీ కూడా రావాలి. అవి నేర్చుకోడానికి లావుపాటి పుస్తకాలు చదవాలి. విరించి ఆ పుస్తకాలని చదివి జాగ్రత్తగా ఆ రూల్స్‌ని అర్థం చేసుకోసాగాడు.

విరించి ఇండియా నుండి వచ్చి కొన్ని వారాలే అయిందని గ్రహించిన ఆ లేడి అమెరికా గురించి విరించి అడిగే ప్రశ్నలకి జవాబులు చెప్పసాగింది. అయితే డ్రయివ్ చేసేటప్పుడు మాట్లాడితే వూరుకునేది కాదు.

అమెరికాలోని ఏభై రెండు రాష్ట్రాల రాజధానులు చిన్న వూళ్ళే. ప్రతీ రాష్ట్రానికి ఓ నిక్‌నేమ్ వుంటుంది. న్యూయార్క్ రాష్ట్రాన్ని ఎంపైర్ స్టేట్ అని, ఆర్కన్సాస్ రాష్ట్రాన్ని లేండ్ ఆఫ్ ఆపర్చునిటి అని, కేలిఫోర్నియా స్టేట్‌ని గోల్డెన్ స్టేట్ అని, టెక్సాస్‌ని లోన్ స్టార్ స్టేట్ అని, ఫ్లోరిడాని సన్ షైన్ స్టేట్ అని.. ఇలా పదమూడు రాష్ట్రలతో స్వతంత్ర సంయుక్త రాష్ట్రంగా అవతరించిన అమెరికా నేడు ప్రపంచ ప్రగతికి దోహదం అయిన దేశంగా ఎలా మారిందో ఆమె కొద్ది మాటల్లో వివరించింది. కామన్‌సెన్స్, రూల్స్‌ని విధిగా పాటించడం, దేనిలోనయినా నిజాయితీగా ప్రవర్తించడం, కష్టపడి చిత్తశుద్ధితో పనిచేయడం.

విరించి డ్రయివింగ్ లైసెన్స్ ఆ రోజు పూర్తయ్యాక ఇద్దరూ మెక్‌డొనాల్డ్ రెస్టారెంట్‌కి వెళ్ళారు. విరించి ఇద్దరికి ఫ్రెంచ్ ఫ్రయిస్, ఏపిల్ పై, కోక్ కొన్నాడు.

"ఫర్ హియర్ ఆర్ టు గో?"

చిరునవ్వుతో కౌంటర్‌లోని పదహారేళ్ళ తెల్లపిల్ల అడిగింది విరించిని.

"వెల్... యాక్చువల్లీ నా తల్లిదండ్రులు, అన్న ఇండియాలోనే వున్నారు. అయినప్పటికీ నేను ఇక్కడే స్టే చేద్దామని వచ్చాను. నాట్ టు గో."

ఆ పిల్ల ఆశ్చర్యంగా చూస్తూ అడిగింది.

"మీ వ్యక్తిగత విషయాలన్నీ నాకెందుకు చెప్తున్నారు?"

"మీరడిగారు కాబట్టి."

"నేనెప్పుడు అడిగాను?" ఇంకా ఆశ్చర్యపోయిందా అమ్మాయి.

"ఇందాక ఇక్కడ వుంటానా లేక వెళ్తానా అన్నారుగా?"

"మీరిక్కడ తింటారా లేక పార్సెల్ తీసుకెళతారా అని నేనడిగింది."

ఓ రోజు ఓ రెస్టారెంట్ బయట వున్న బోర్డ్‌ని చూసాడు.

శాన్‌ఫ్రాన్సిస్కో నించి సాల్ట్‌లేక్ సిటీ రూట్‌లో ప్రయాణం చేసే డెల్టా ఏర్‌లైన్స్ విమానాలన్నింటిలో భోజనం మేం సప్లై చేసేదే అతనికో చిలిపి ఆలోచన రావడంతో నిర్భయంగా లోపలికి వెళ్ళి అడిగాడు సూట్‌లోవున్న స్టివార్డ్‌ని.

"విమానంలో సర్వ్ చేసే కోర్స్ ఇస్తారా ఇక్కడ?"

"సారీ సర్. ఆ కోర్స్ ఎయిర్‌లైన్స్ వాళ్ళు ప్రత్యేకంగా ఆర్డర్ చేసి తెప్పించుకునేది. అయితే అంత రుచిగా వుండే ఇతర పదార్థాలున్నాయిక్కడ."

"ఊహూ. అది లాభంలేదు" చెప్పాడు విరించి "నేను ఆ రూట్‌లో ప్రయాణించినప్పుడల్లా సిక్ అవడానికి ఆ ప్రయాణమా, లేక అక్కడ సర్వ్ చేసే ఫుడ్డా కారణం తెలుసుకోవాలనుకుని వచ్చాను. "

వచ్చిన నాలుగోరోజు నించి విరించి తన అన్నకి, మానసికి ఇ - మెయిల్స్ రోజుకొకటి చొప్పున ఇస్తునే వున్నాడు. వాళ్ళనించి రోజుకో మెయిల్ వస్తోంది. గోపీనాథ్ నించి సూచనలు, మానసి నించి లవ్ లెటర్స్.

ఇద్దరు కలిసినప్పుడు ఎన్నడూ మాట్లాడని విషయాలు, భావాలు లెటర్స్‌లో రాస్తోంది మానసి. తను విరించిని ఎంతగా మిస్ అవుతుందో కొంత, తన నిత్య జీవితంలోని సంఘటనల గురించి కొంత.

దివాకర్ ఇచ్చిన 'ది బుక్ ఆఫ్ డేస్' అనే పుస్తకం కూడా చదువుతున్నాడు విరించి. అందులో అమెరికాలో ముఖ్యమయిన చారిత్రాత్మకరోజులు గురించిన తేదీలు, వివరాలు వున్నాయి. దానివల్ల విరించికి అమెరికన్ హిస్టరీ కొద్దికొద్దిగా అర్థం అవసాగింది. అందులో అమెరికన్ ప్రెసిడెంట్ల గురించిన చరిత్ర, అమెరికా చేసిన యుద్ధాలు, అమెరికాలోని కొత్తచట్టాలు - ఇలా ఎన్నో విషయాలు అందులో వున్నాయి.

అమెరికన్ ఇండిపెండెన్స్‌డే ఫోర్త్ ఆఫ్ జులై అని, ఆ దినం సూర్యోదయ సమయంలో, మధ్యాహ్నం, సూర్యాస్తమయ సమయాల్లో స్వాతంత్ర్యం తెచ్చిన వారి గౌరవార్థం తుపాకులు పేల్చడం గురించి, ఆ రాత్రి అమెరికా అంతటా కొన్ని వందల రకాల ఫైర్ వర్క్స్‌ని కాల్చడం గురించి చదివాక ఫోర్త్ ఆఫ్ జులై ఎప్పుడొస్తుందా అనిపించింది విరించికి. ఇండియా మీద కూడా ఇలాంటి పుస్తకాన్ని ఎవరయినా రాయవచ్చుకదా అని కూడా అనిపించిందతనికి.

ఓరోజు సునీతని డాట్ బస్టర్స్ గురించి అడిగాడు.

"డాట్ బస్టర్స్ అంటే యిక్కడ నివసించే ఇండియన్స్‌ని ద్వేషించే రేషియల్ గ్రూప్. పంతొమ్మిది వందల ఎనభై ఏడు - ఎనిమిదిలలో న్యూజెర్సీ సిటీలోని ఇండియన్స్ మీద ఈ గ్రూప్ అటాక్ చేసింది. డాట్ అంటే మన ఆడవాళ్ళు ధరించే బొట్టు. న్యూజెర్సీలోని అనేకమంది ఇండియన్స్ మీద, వారి కార్లు, ఇతర ఆస్తులమీద అనేక దాడులు జరిపారు. అయితే ప్రభుత్వం వెంటనే దీనికి స్పందించి ఇండియన్స్‌ని రక్షించే బిల్‌ని తెచ్చింది. అంతకుపూర్వం కేవలం తెల్లవాళ్ళే వుండే కమ్యూనిటిలో వున్న ఇండియన్స్ కార్ల టైర్లని ఎవరైనా కోసేస్తే అది లోకల్ క్రైమ్‌గా పరిగణించేవారు. కానీ ఈ బిల్లువల్ల అది రేషియల్ క్రయింగా పరిగణించి అంతకు మునుపు లోకల్ క్రయింగా విధించే శిక్షకి రెట్టింపు శిక్షని అలాంటి నేరస్థులకి విధించే అవకాశాన్ని ఆ బిల్లుద్వారా కల్పించారు. న్యూజెర్సీ లా అండ్ పబ్లిక్ సేఫ్టీ కమిటి ఈ బిల్‌ని పాస్ చేసింది."

"ఇప్పుడు డాట్ బస్టర్స్ లేరా?"

"లేరనే చెప్పాలి. మళ్ళీ ఎక్కడా వార్తల్లో వాళ్ళ గురించి రాలేదు. దానికి బాధ్యులైన జేమ్స్, కెర్విన్, డేవిడ్ జెస్టర్‌లకి శిక్షలు పడ్డాయి. బట్ ఇన్ జనరల్ ఇక్కడ క్రయిం ఎక్కువ."

"దానికి కారణం ఇక్కడి సిస్టమనే చెప్పాలి" చెప్పాడు దివాకర్.

ప్రశ్నార్థకంగా చూసాడు విరించి.

"ప్రభుత్వం ప్రజలందరికీ సోషియల్ సెక్యూరిటీనిస్తోంది. అంటే ఉద్యోగం లేనివాళ్ళకి నిరుద్యోగ భత్యం యిస్తుంది. దాంతో చాలామంది నీగ్రోలు ఉద్యోగాలు చేయకుండా దాన్ని తీసుకుంటూ అది చాలక నేరాలు చేస్తుంటారు. వాళ్ళ నేర ప్రవృత్తిని ఇన్‌డైరెక్ట్‌గా ఈ సిస్టం ప్రోత్సహిస్తోందని నా అభిప్రాయం. ఇండియాలో బీదరికం, సంపాదించే అవకాశాలు లేకపోవడం దొంగలని తయారు చేస్తే ఇక్కడి ఈ సిస్టం దొంగలని తయారుచేస్తోంది."

సునీత చెప్పింది వెంటనే నవ్వుతూ.

"ఇక్కడో జోక్ తరచూ వింటుంటాను. బేంక్‌కి నల్లవాడు డబ్బుకోసం వెళితే కేషియర్ చెక్ తెచ్చావా లేక తుపాకీనా అని అడుగుతుందట."

విరించి అమెరికాకి వచ్చి నెలన్నర దాటాక చెప్పాడు దివాకర్‌సింగ్ ఓరోజు.

"నీవు మా తిండి తింటూ, మా యింట్లో వుంటున్నందుకు మొహమాటపడుతున్నావని గమనిస్తూనే వున్నాను. నీకిక్కడి మనుషులు, పద్ధతులు అర్థం అయితేగానీ వాళ్ళ మధ్య పనిచేయలేవు. అది నీకు పట్టుబడేదాకా ఏ వుద్యోగంలో స్థిరంగా వుండలేవు. నేననుకున్న దానికన్నా నీవు త్వరగా అన్నీ నేర్చుకున్నావు. రేపు నీ కారు డ్రయివింగ్ లైసెన్స్ పరీక్షలో పాసయి నీకు లైసెన్స్ రాగానే నిన్ను వుద్యోగంలో పెట్టే పూచీనాది."

"జాగ్రత్త. నాన్‌వైట్ స్కిన్‌వాళ్ళని ఓ పట్టాన మొదటిసారి కారు డ్రయివింగ్ టెస్ట్‌లో పాస్ చేయించరని ప్రతీతి" హెచ్చరించింది సునీత.

మర్నాడు డ్రయివింగ్ టెస్ట్‌కి ప్రాక్టికల్స్‌కి వెళ్ళాడు విరించి.

దివాకర్ వీకెండ్‌కి అమెరికాలోని ఓ పెద్ద చెయిన్ ఆఫ్ షాప్ అయిన సెవెన్ - ఎలివెన్ స్టోర్స్‌కి తీసుకెళ్ళాడు విరించిని. విరించి వర్క్‌పర్మిట్ చేసాక అక్కడ మేనేజర్ విరించి గురించి క్లుప్తంగా వివరించాడు.

దివాకర్ - ప్రాణభయంతో ఇండియానుంచి వచ్చి రాజకీయ పునరావాసం అప్లై చేసిన వుదంతం.

"పూర్ కిడ్" సానుభూతిగా చెప్పాడు ఆయన.

"యు మస్ట్ హెల్ప్‌మి" అర్థించాడు విరించి.

"ష్యూర్. నాకు వుద్యోగస్తుల అవసరం వుంది. రేపు జాయిన్ అవుతావా?" అడిగాడాయన.

"ష్యూర్. థాంక్స్."

ఆ నల్ల వ్యక్తితో కరచాలనం చేసాడు విరించి.

అమెరికా గురించి ఒక్కోటి అర్థం అవుతున్నకొద్దీ విరించికి ఎంతో ఆశ్చర్యం వేయసాగింది. ఆకాశాన్నంటే స్కై స్కేపర్లు, రాత్రిని కూడా పట్టపగల్లా భ్రమింపచేసే నియాన్ లైట్లు, వెడల్పైన రోడ్లమీద వేల సంఖ్యలో వెళ్ళే అందమైన కార్లు, మోడ్రన్ డ్రస్‌లతో ధగధలాడిపోయే మనుషులు, బయటకి కనపడే ప్రపంచం.

కానీ సామాజికంగా అమెరికా ఇండియాకన్నా ఎంతో అధ్వాన స్థితిలో వుందన్న సత్యాన్ని విరించికి క్రమంగా అర్థం అవసాగింది. ప్రపంచం మొత్తం మీద అప్పులు అధికంగా గల ప్రజలు అమెరికన్స్.

కీలకమైన ఉద్యోగాలకి అభ్యర్థుల కొరత వున్న సామాన్యమైన ఉద్యోగాలకి పోటీ అధికం.

టి.విల్లో వారానికి సగటున పధ్నాలుగు రేప్ కేసులు, ఇరవైనాలుగు హత్యలు, నూట ఏభై తొమ్మిది లైంగిక దృశ్యాలు ప్రసారం అవుతున్నా యని ఓ పేపర్‌లో రాసారు. వాటి స్పందన యువత మీద అధికంగా పడుతోంది. పదిహేను ఏళ్ళు వచ్చేసరికి అరవై రెండు శాతం అమ్మాయిలు తమ కన్యాత్వాన్ని కోల్పోతున్నారు. వివాహేతర అక్రమ సంబంధాలు కూడా దాదాపు అదే నిష్పత్తిలో వున్నాయి. డ్రగ్స్ విచ్చలవిడిగా దొరుకుతాయి. వాటిని కొనడానికి దొంగతనాలు సర్వసాధారణ. తుపాకులు ఆత్మరక్షణ పేరిట లైసెన్స్ అవసరం లేకుండా కొనుక్కోవచ్చు. వంద డాలర్లకో రివాల్వర్ వస్తుంది. పది సంవత్సరాలలోపు పిల్లల స్కూల్ బేగ్స్‌లో పిస్తోళ్ళు, బటన్ కత్తులు తెస్తూండటంతో షికాగోలాంటి పట్టణాల్లోని కొన్ని స్కూళ్ళ బయట పిల్లల్ని మెటల్ డిటెక్టర్స్‌తో చెక్ చేసి మరీ లోపలకు పంపుతున్నారు. మొత్తం నూటయాభై డాలర్ల విలువచేసే రిస్ట్‌వాచీ, కాలిబూట్ల కోసం హత్యలు జరుగుతుంటాయి.

వృద్ధాప్యంలోని తల్లిదండ్రులని పిల్లలు తమ ఇంట్లో వుంచుకుని చూడరు. వృద్ధాప్య శరణాలయాల్లో చేరాల్సిందే. పదిహేను ఏళ్ళు వచ్చాక పిల్లలు కూడా ఆ పని, ఈ పనిచేసి సంపాదించుకుని చదువుకోవాల్సిందే తప్ప తల్లితండ్రులు ఆర్థికంగా వాళ్ళని ఆదుకోరు. అలా సంపాదించేది పెద్దలకి లెక్క చెప్పక్కర్లేదు. కాబట్టి దాన్ని డ్రగ్స్‌కి, వ్యభిచారానికి ఖర్చుచేస్తుంటారు. పద్దెనిమిదేళ్ళు వచ్చాక పిల్లలు తల్లిదండ్రులు నించి విడిపోయి తమకి నచ్చిన వాళ్ళతో వివాహేతరంగా జీవిస్తుంటారు. పాతికేళ్ళు కలిసి కాపురం చేసిన సందర్భంగా ఓ దంపతులని కేలిఫోర్నియా రాష్ట్రంలో ఘనంగా సన్మానించిన ఉదంతం టి.విలో చూసి ఆశ్చర్యపోయాడు విరించి.

విరించి సునీతతో చెప్పాడు అది చూసి.

"ఇండియాలో మనవాళ్ళలో ఎక్కువమందికి సెల్‌ఫోన్‌లు, లాన్‌లు, లాన్‌మూవర్లు, కార్లు, విమానాలు, మరపడవలు లేకపోవచ్చు. కాని వాటికి బదులుగా కుటుంబ సభ్యుల మీద ఆప్యాయత, నైతిక విలువల మీద గౌరవం వున్నాయి. ఈ రెండు వాటిన్నిటితోటి సమానం."

"నాకు అదే భయం, పెద్దయితే మా పిల్లలు ఇక్కడి వాళ్ళలా తయారవుతారేమోనని. ఎంత జాగ్రత్తగా పెంచినా సమాజపు నీడ వీళ్ళమీద పడకుండా వుండదు."

"సరిపడేంత సంపాదించుకున్నాక వాళ్ళు పెద్దయ్యేసరికి ఇండియా వెళ్ళిపోవచ్చుగా?"

"అదీ నిజమే అక్కడ దొరకదని ఇక్కడికి వస్తాం. కానీ ఇన్నేళ్ళు ఇక్కడ జీవించాక, ఈ సౌకర్యాలకి మరిగి ఇండియా పోబుద్ధికాదు. అక్కడికి వెళ్ళొచ్చిన ప్రతివారు చెప్పేవి చేదు అనుభవాలే. నీళ్ళు, కరెంట్ ఇబ్బందులు, దోమలు, డస్ట్, సరిగ్గా వుండని రోడ్డు సౌకర్యాలు, అమెరికా నించి వచ్చారని తెలిస్తేచాలు, ఎయిర్ పోర్ట్‌లో కస్టమ్స్ శాఖ నించి టాక్సీ డ్రయివర్ దాకా దోచుకోవాలని చూసే ప్రతీ ఒక్కరు. క్వాలిటీ ఆఫ్ లివింగ్ తక్కువ. క్వాంటిటి ఆఫ్ కష్టాలు ఎక్కువ. దాంతో తిరిగి వెళ్ళడానికి జంకుతుంటాం. ఓ నాలుగైదేళ్ళు ఇక్కడున్నాక ఇండియాని మిస్ అవుతున్నాం అని బాధపడుతూ కూడా, మనల్ని ఇక్కడ ఎవరు ఈ దేశానికి కట్టిపడేయకపోయినా కదలలేం. ఆంధ్రప్రభ వీక్లీ చదువుతూ, గండరగండడో, బొబ్బిలిపులో సినిమా కేసెట్ చూస్తూ, ఇంటర్నెట్‌లో తెలుగు వెబ్‌సైట్‌లని సర్వేచేస్తూ, తిరుమల డాట్ ఆర్గ్‌లో రోజూ ఏడుకొండల వాడికి దణ్ణం పెట్టుకుంటూ, ఏటా ఖర్చులు పోను ఎంత దాచామో లెక్క చూసుకుని దాన్ని రూపాయల్లోకి మార్చి చూసుకుని మురిసిపోతూ ఈ ఇరవై ఏడుకోట్ల పదిలక్షల మంది జనాభాతో కలవనూ లేక, కలవకుండా వుండనూ లేక బండిని లాక్కొస్తుంటాం."

సునీత మాటల్లో ఎంతో ఆక్రందన, ఎందరో భారతీయ వలసదారుల ఆవేదన తొంగి చూశాయి.

"ఏ క్షణాన అమెరికాలో కాలు పెట్టాడో కానీ మా అన్నయ్య గోపీకి అమెరికా అంటే పడదు. తిరిగి వచ్చేస్తా అంటూండేవాడు. ఇప్పుడు అర్థమైంది నాకు సంపాదనకి అమెరికా, వుండటానికి ఇండియా బెటర్ అని వాడు ఎందుకు అంటుంటాడో" చెప్పాడు విరించి.

"ఆఖరికి ఇక్కడ ఇండియన్స్ అంటే కూడా మనం కాదు. రెడ్ ఇండియన్స్ అనర్థం. వాళ్ళు మనకి పెట్టిన పేరు ఏషియన్ అమెరికన్స్. కేలిఫోర్నియా, న్యూజెర్సీ, న్యూయార్క్, టెక్సస్, ఫ్లోరిడా, ఇల్లినాయిస్ ఫ్లోండా ఈ ఏడు రాష్ట్రాల్లో ఎక్కువగా ఇరుక్కుంటున్నాం. న్యూయార్కులోని జాక్సన్ హైట్స్ కెళితే మిర్చిబజ్జీ వాసనలు, బొట్లు, కొప్పులు, జడలు, చీరల రెపరెపలు, మల్లెలు, వాటితోపాటు ఈగలు, దోమలు, బొద్దింకలు కూడా చూడచ్చు. దాన్ని లిటిల్ ఇండియాగా పేరు మార్చమని మనవాళ్ళు అడగడంలో అర్థం వుంది" నవ్వింది సునీత.

"షికాగోలో ఓ వీధికి గాంధీ పేరు పెట్టారనుకుంటాను?" అడిగాడు విరించి.

"వీటికి తక్కువేం లేదు. న్యూజెర్సీలో ఓ హైస్కూలు పేరు కూడా మహాత్మాగాంధీ హైస్కూలు, న్యూయార్క్‌లోని ఓ ప్రధాన కూడలిలో గాంధీ విగ్రహం వుంది. ఫ్లింట్ అనే వూళ్ళో ఓ వీధికి 'నార్ల' పేరు పెట్టారు. విజయవాడకు చెందిన ఉప్పలూరి రామ్ అమెరికన్ సెనెట్ కాంగ్రెస్‌కి అభ్యర్థిగా పోటీ చేశారు. ఇహ పిట్స్‌బర్గ్ సరేసరి. అది మినీ తిరుపతి. మనవాళ్ళ పెళ్ళిళ్ళు, సమావేశాలు, మొక్కులు అన్నిటికి పిట్స్‌బర్గ్ వెంకటేశ్వరస్వామి దేవాలయ ప్రధానం."

"అమెరికా అంటే అంతా ప్రపంచంలోని ఎక్కడనించో ఇక్కడికి వచ్చిన వారేకదా. వాళ్ళకూ ఈ సమస్యలుండే వుంటాయి కదా?" అడిగాడు విరించి.

"లేదు. ఎక్కువభాగం యూరప్ నుంచి వచ్చారు. ఒకే మతం, ఒకే రకం చర్మం రంగు కాబట్టే వాళ్ళకది వరం అయింది. నీకు తెలుసా? ఇండియా నించి మొట్టమొదటిగా అమెరికాకి వలస వచ్చింది ఎయిటీన్ ట్వంటీలో. అప్పుడు ఒక్కరే వచ్చారు. ఆ తర్వాత నైన్టీన్ సిక్స్‌టీదాకా వలస వచ్చిన మొత్తం ఇండియన్స్ సంఖ్య ఎనిమిదివేల అయిదువందల ఏభై తొమ్మిది మందిట. గేట్లెత్తేసాక నైన్‌టీన్ సిక్స్‌టీ వన్ టు సెవెంటీ మధ్య ఇరవై రెండువేల మంది, సెవెంటీ ఒన్ టు ఎయిటీ మధ్య లక్ష అరవై నాలుగువేల మంది, ఎయిటీ ఒన్ టు ఎయిటీ నైన్ మధ్య రెండు లక్షల ఇరవై రెండువేల మంది వచ్చారు. ఇప్పుడు ఇక్కడి ఇండియన్స్ సంఖ్య పదిలక్షల పైబడే"

ఆ కొత్త వాళ్ళ దేశంలో సునీత, విరించి దేశకాల పరిస్థితుల గురించి చర్చించుకుంటుండగా ఇమిగ్రేషన్ అండ్ నేచురలైజేషన్ సర్వీసెస్ సెంటర్‌లో విరించి ఫైల్‌ని ఓ అధికారి తీసి దాన్ని జాగ్రత్తగా వెట్టింగ్(దీర్ఘ పరిశీలన) చేయసాగాడు. కొంతదాకా అతను విరించి కథను నమ్మాడు. కానీ, ఓ పాయింట్ దగ్గరికి వచ్చేసరికి అతనికి ఓ చోట అది అబద్ధం అయి వుండచ్చన్న చిన్న వాసన వేసింది.

ఆ వాక్యాన్ని అతను పార్కర్ పెన్‌తో అండర్ లైన్ చేసి మార్జిన్‌లో ప్రశ్నార్థకంగా గుర్తుని పెట్టాడు.

అందులోని నిజానిజాలని క్షుణ్ణంగా పరిశీలించి కానీ వదలరు.

ఆరోజే ఆ అధికారి మద్రాస్‌లో విరించికి వీసాని జారీచేసిన అమెరికన్ కన్‌సులేట్‌కి ఆ పేజి జిరాక్స్ కాపీని, తన అనుమానాన్ని ఫేక్స్ చేశాడు.

కన్సలేట్ నించి జవాబు వచ్చేదాకా ఆ ఫైల్ పెండింగ్‌లో వుంచుతారు.

***( కొనసాగింపు వచ్చేనెలలో)***

Post your comments

**ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి**